పేదలకు నాణ్యమైన వైద్యసేవలు

ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో అదనపు భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ సదుపాయాలు కల్పిస్తూ పేదలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రూ.3.40 కోట్లతో నిర్మించిన అదనపు భవనాలు, 50 పడకల ఆస్పత్రిని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని 40 గ్రామాలకు కేంద్రంగా ఉన్న తిరువూరులో ఆధునిక వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, కోవిడ్ ఆస్పత్రి, ఆక్సిజన్ ప్లాంట్, డయాలసిస్ యూనిట్లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. రోగులకు అవసరమైన అత్యవసర వైద్యసదుపాయాలను కల్పించేందుకు కూడా త్వరలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆస్పత్రిలోని వార్డు గదులను, భవనాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, విస్సన్నపేట ఎంపీపీ వనజాక్షి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలినడకన భద్రాద్రి రామయ్య సన్నిధికి



సత్యాలపాడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం సత్యాలపాడు శ్రీ సత్యాం బకేశ్వర్ గురుస్తాన్ ఆలయం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు తెలంగాణా రాష్ట్రం భద్రాద్రి రామయ్య సన్నిధికి కాలినడకన సోమవారం బయలుదేరారు. భక్తులు 120 కిలోమీటర్ల దూరం కాలినడకన నడిచి ఈ నెల 23వ తేదీ ముక్కోటి ఏకాదశికి ఆలయం వద్దకు చేరుకుంటారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



ఇబ్రహీంపట్నం: మూడో సచివాలయం, గుంటుపల్లి సెయింట్ పీటర్స్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. గుంటుపల్లిలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ పాలడుగు జోత్స్న, పాలడుగు దుర్గాప్రసాద్ దంపతులు కేక్ కట్‌చేశారు. మూడో సచివాలయంలో జరిగిన వేడుకల్లో సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, వలంటీర్లు, కౌన్సిలర్లు కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు.

జోరుగా పైప్‌లైన్ నిర్మాణ పనులు



కొండపల్లి (ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ 29వ వార్డులో పైప్‌లైన్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. 2016లో 30వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హైవే పక్కన కొన్ని ఇళ్లు తొలగించడంతో పాటు పైప్‌లైన్ సైతం ధ్వంసం అయింది. అప్పటి నుంచి ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు కొండపల్లి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.8 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో సుమారు 800 మీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి



చాట్రాయి: సామాజిక దృక్పథం ప్రతి ఒక్కరిలో కలిగియుండాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని చిత్తపూరులో ఆదివారం రాత్రి జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా మార్గం ద్వారా ప్రజల మన్ననలను పొందాలని ప్రజలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి ఎందులో ఉండదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ తిరువీధి రమేష్ పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ



తాతకుంట్ల (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొదుమూరు విష్ణువర్ధనరావు, ఆయన సోదరులు సత్యనారాయణ, రాంబాబు, మధుసూదనరావు ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రులు కృష్ణమూర్తి, చంద్రావతి జ్ఞాపకార్థం రూ.40 వేలు విలువ చేసే సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. తాతకుంట్ల, గౌరంపాలెం గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు కూర్చొనేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బల్లలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.విష్ణువర్ధనరావు, కాలీషా, కోలేటి పాపారావు, సచివాలయ కన్వీనర్ ఖాసీం పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటిచూపు నిర్ధారణ పరీక్షలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి క్రాంతి హైస్కూల్లో విద్యార్థులకు కంటిచూపు నిర్ధారణ వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. మాక్సీ విజన్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సగమం ఆధ్వర్యంలో 600 మంది విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు జరిపారు. గ్యాట్ వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, డీవీఎస్ సుధాకర్, అనుమోటి చెన్నయ్య, యుగంధర్, పాఠశాల అధినేతలు వెనిగళ్ల మురళీమోహన్, అమ్మాజీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి



తోటమూలలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



విస్సన్నపేటలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం మండలంలో సుబ్రహ్మణ షష్ఠిని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తోటమూల శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గంపలగూడెం భజన మందిరంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు.

నూజివీడులో..

నూజివీడు: మండలంలోని అన్నవరంలో వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు భావరాజు పుల్లారావు పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య ఏకనామ భజన నిర్వహించి రాత్రి 7గంటలకు స్వామి వారి కల్యాణం జరిపారు.

నూజివీడు పట్టణంలో..

సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న శివాలయంలో సోమవారం స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణాన్ని నిర్వహించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక నూజివీడు రోడ్డులో ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మానసాదేవి స్వరూపిణీ ఆలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని సూరంపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామికి పూజలు చేశారు.

తిరువూరులో..

తిరువూరు: స్థానిక షిర్డిసాయి కల్యాణ మంటపంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి జరిపారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పలువురు దంపతులు నిర్వహించారు.

ఘనంగా సుబ్బారాయుడి కల్యాణం

ముసునూరు: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సోమవారం గోపవరం శివారు నాగేంద్రపురంలోని ప్రసిద్ధ శ్రీ వల్లీ దేవసేన సమేత, ప్రత్యక్ష శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామునే తొలుత స్వామి వార్ల మూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పలువురు భక్తులు పుట్టలో పాలు పోసి, తమ పిల్లల చెవులకు పోగులు కుట్టించి, సదా కాపాడమని వేడుకున్నారు.



గోపవరంలో నాగేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం

ఆరోగ్యశ్రీ కార్యక్రమం వర్చువల్‌గా వీక్షణ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఆరోగ్యశ్రీ కార్డుల ఆవిష్కరణను వర్చువల్‌లో వీక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన ఫీజర్లతో ప్రవేశ పెడుతున్న ఆరోగ్యశ్రీ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వర్చువల్‌గా కొండపల్లి మున్సిపాల్టీలోని 10వార్డు సచివాలయాల్లో సోమవారం అధికారులు వీక్షించారు. కొత్త ఫ్యూచర్లతో క్యూఆర్ కోడ్ కలిగిన ఈ–కార్డులు యజమాని పేరు, ఫొటో, ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలతో ఎక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు చేయడం మంచి పరిణామమని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ఇంటింటికీ అందజేస్తామని ఆయన తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ఆరోగ్యశ్రీ పరిమితికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా సీఎంఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాన్ని ఆచరణలోనికి తెస్తూ నిర్వహించిన కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు వైఎస్సార్ సీపీ నాయకులు వీక్షించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వైద్యాధికారి శృతి, ఎంఈఓ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తృతం కానుండడంపై వైస్ ఎంపీపి కోటగిరి రాజానాయన హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ సేవల విస్తృత ప్రారంభోత్సవ కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు డిజిటల్ స్క్రీన్‌లపై వీక్షించారు. లోపూడిలో సర్పంచ్ పేరం కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ఆరోగ్యశ్రీ సేవలపై ప్రసంగించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ–1 చాట్ల రాబర్టు, మండల సచివాలయ కన్వీనర్ భరత్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, డాక్టర్ మణిబాబు పాల్గొన్నారు.

సామాజిక భవనానికి స్థలం కేటాయించాలి

తిరువూరు: తిరువూరులో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘానికి సామాజిక భవన నిర్మాణ నిమిత్తం స్థలం కేటాయించాలని సంఘ ప్రతినిధులు సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు విజయవాడలో వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ స్థలం కేటాయిస్తే తాము భవన నిర్మాణం జరుపుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఆర్‌కే చారి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలి

ముసునూరు: హైస్కూల్ తరఫున డివిజన్ స్థాయిలో ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయి కౌశల్–2023 పోటీలకు ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ నెల 20న ఏలూరులో జరుగనున్న జిల్లా స్థాయి కౌశల్–2023 పోటీల్లోనూ విద్యార్థులు సత్తా చాటాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులు తేజసాయి, నాగస్పందన, దివ్యశ్రీని హెచ్ఎం రామకృష్ణ అభినందించారు.

పాల ఉత్పత్తిదారులకు వైద్యశిబిరం

లక్ష్మీపురం(తిరువూరురూరల్): కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో తిరువూరు మండలం, లక్ష్మీపురం పాలశీతల కేంద్ర ఆవరణలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎముకలు, వెన్నెముక, కీళ్ల సమస్యలు, గుండె సంబంధ జబ్బులు, దంతవ్యాధులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. తిరువూరు ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రి, నవీన్ దంత వైద్యశాలల వైద్యులు ఈ శిబిరంలో పాల ఉత్పత్తిదారులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



వల్లమానులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

ఆగిరిపల్లి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. సోమవారం వడ్లమానులో ఆంధ్రప్రదేశ్‌కి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. రూ.21 కోట్లతో అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ, ఉప సర్పంచ్ నరదాల రాంబాబు, సచివాలయల కన్వీనర్ భాస్కర్‌ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలం, ఆగిరిపల్లి పోలింగ్ స్టేషన్లను సోమవారం రోలర్ అబ్జర్వర్ బి.శ్రీధర్, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే వరకు ఓటర్ల జాబితాలో తొలగింపులకు, మార్పులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

రైతు భరోసా నమోదుకు పోర్టల్ అవకాశం

మైలవరం: వైఎస్సార్ రైతు భరోసాను 2023–24 సంవత్సరంలో కూడా ఇప్పటికే రెండు విడతలు ప్రభుత్వం అందించినట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్ సోమవారం తెలిపారు. అర్హులై ఉండి ఈ సంవత్సరం లబ్ధి పొందని కౌలు రైతులు, అటవీ భూమి సాగుదారుల కోసం ఈ నెల 17వ తేదీ నుంచి నమోదు చేసుకునేందుకు రైతు భరోసా పోర్టల్‌లో అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కౌలు రైతులు వారి వివరాలు నమోదు చేసుకునేందుకు కౌలు ఒప్పందం పత్రమైన పంట సాగుదారు హక్కు పత్రం, ఆధార్ నకలు, అటవీ భూమి సాగుదారులు సంబంధిత పట్టా, ఆధార్ నకలుతో పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని వ్యవసాయ శాఖ కమిషనర్ పేర్కొన్నారు.

అఖిల్ మృతి తీరని లోటు



అఖిల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీరెడ్డి

నూజివీడు: విద్యార్థులు తెలిసీ తెలియక చేస్తున్న పనుల వల్ల తల్లిదండ్రులకు బాధను మిగల్చడం దయనీయమని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. బందరు బీచ్‌లో అలల తాకిడికి మృతి చెందిన శ్రీకాకుళం ట్రిపుల్ఐటీ విద్యార్థి తోకల అఖిల్‌కు సోమవారం నూజివీడు ట్రిపుల్ఐటీలో సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అఖిల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యపైనే దృష్టి సారించి చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. తద్వారా తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులను జీవిత కాలంలో శోకంలోకి నెట్టే పనులు చేయకూడదన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ట్రిపుల్ఐటీ డైరెక్టర్ ఆచార్య కేవీజీడీ బాలాజీ, రిజిస్ట్రార్ ఆచార్య గోపాలరాజు, ఏఓ భానుకిరణ్, సెంట్రల్ డీన్ డీ శ్రావణి, ఓఎస్డీ సుధాకర్‌బాబు, రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

డీఎస్పీ అశోక్‌కుమార్



నూజివీడు పోలీస్‌స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ అశోక్‌కుమార్

నూజివీడు: పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను సోమవారం డీఎస్పీ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులకు సంబంధించి త్వరితగతిన చార్జిషీట్‌లను వేయాలని సిబ్బందికి సూచించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సమీపిస్తున్నందున కోడిపందేల నిర్వాహకులను, కోడికత్తుల తయారీదారులను బైండోవర్ చేసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున రౌడీషీటర్లపై నిఘా ఉంచి వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



ఆర్లపాడులో వేణుగోపాలస్వామి కల్యాణం

ఆర్లపాడు(గంపలగూడెం): ధర్మ ప్రచారంలో భాగంగా గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాల స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం ఆర్లపాడులో స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నెమలి దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనంపై ఆర్లపాడు తీసుకొచ్చారు. అనంతరం సత్యభామ, రుక్మిణీదేవి సమేతవేణుగోపాలస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామ వర ప్రసాదరావు పాల్గొన్నారు.

పూత, కాయ రాని మిరప

'స్పందన'లో రైతుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మిరప రైతులు, రైతు సంఘం నాయకులు

సొబ్బాల(గంపలగూడెం): గంపలగూడెం మండలం సొబ్బాలకు చెందిన 20 మంది రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 30 ఎకరాల్లో మిరపసాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. నాసిరకం నారు కారణంగానే తమకు నష్టం వాటిల్లిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతుల కథనం మేరకు.. గ్రామంలో ఉన్న శ్రీరామ్‌గోపాల్ నర్సరీలో రెడ్ నాట్‌ప్లస్ 1122 అనే రకం మిర్చినారును కొనుగోలు చేసి, పైరు సాగు చేశారు. కానీ పూత, కాయరావడం లేదు అని బాధిత రైతులు వాపోయారు. ఈ సమస్యను నర్సరీ నిర్వాహకులకు తెలిపినా స్పందించలేదు. ఈ పరిస్థితుల్లో బాధిత రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి స్పందనలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, కుటుంబరావు, చిన్న సత్యంబాబు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



తిరువూరు: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత గ్యాస్ కనెక్షన్లను తిరువూరులో సోమవారం మహిళలకు పంపిణీ చేశారు. రఘు గ్యాస్ ఏజెన్సీస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా శివ సుబ్రహ్మణ్యం, స్థానిక నాయకులు అన్నవరపు సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, మాధవరావు, సురేష్ ఈ వంట గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. డిస్ట్రిబ్యూటర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కవలల దినోత్సవం



తిరువూరు: అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని స్థానిక నాగార్జున స్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థుల్లో పలువురు కవలలు ఏకరూప వస్త్ర ధారణతో కనువిందు చేశారు. కవల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

వినోద్ మిశ్రాకు ఘన నివాళి

చాట్రాయి: వినోద్ మిశ్రా ఆశయాలను కాపాడదామని ఏలూరు జిల్లా సీపీఎం(లిబరేషన్) ఏలూరు జిల్లా కార్యదర్శి డి.హరనాథ్ తెలిపారు. సోమవారం మండలంలోని మర్రిబంధంలో వినోద్ మిశ్రా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతోన్మాదులు, ఫాసిస్టులకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ఆయన చెప్పారు. అనంతరం మిశ్రా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దుర్గం పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాసం పూజలు

చాట్రాయి: మండలంలోని ప్రజలు సోమవారం ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాట్రాయి రామాలయం, చనుబండ శ్రీ కోదండ రామాలయంలో స్వామివారిని ఊరేగించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

నూజివీడు: మండలంలోని పోలసానపల్లి, వెంకటాయపాలెంలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీఆర్‌కే రంగారావు, ఏలూరు జిల్లా కోశాధికారి మాటూరి రవికాంత్, నాయకులు ఆముదాల ఇస్సాకు, నాయకులు బోను అప్పారావు, సర్పంచి డోలా ప్రభాకర్, నాగ ముసలయ్య పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఆగిరిపల్లి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆశ అన్నారు. ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జగన్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీడీవో శంకర్రావు, డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఈఓపీఆర్డి శేఖర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భూసమస్యలపై 'స్పందన'లో ఫిర్యాదు



తిరువూరు: స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. భూసంబంధ సమస్యలపై పలు అర్జీలు వచ్చినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్లో నమోదు చేసి నిర్ణీత గడువులోపు అర్జీలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆర్డీఓ మాధవి స్పందన అర్జీలు స్వీకరించారు.